
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట
సోమవారం 6 జనవరి 2025

కోహీర్‌లో తగ్గని చలి

- ఆదివారం ఉదయం 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



ఆదివారం ఉదయం మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రాన్ని కమ్మేసిన పొగమంచు

కోహీర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. వారం రోజులుగా చలి తీవ్రత పెరుగుతూ వస్తున్నది. శనివారం రికార్డు స్థాయిలో 6 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోగా.. ఆదివారం ఉదయం 7.1 ఉష్ణోగ్రత నమోదయింది. ఉదయం చలి, పొగ మంచుకు ఈదురుగాలు కూడా తోడుకావడంతో తీవ్రత మరింత పెరుగుతున్నది. ప్రజలు ఉదయం 9 గంటలు దాటినా ఇంట్లో నుంచి బయటికి రావడం లేదు. తప్పని పరిస్థితుల్లో పాలవ్యాపారులు, వ్యవసాయదారులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు ధరించి తమ పనులకు వెళ్లారు. మరో రెండు రోజులు చలి తీవ్రత కొనసాగుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు

కోహీర్ 7.1, అల్గోల్ 7.7, మల్‌చెల్మ 9.5, మొగుడంపల్లి 9.8, సత్వార్ 9.8, న్యాల్‌కల్ 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా చిప్పల్‌తుర్తి 10.7, నర్సాపూర్ 11.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట్-భూమ్‌పల్లి 10.9, కొండపాక 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నుమాయిష్‌లో ప్రాంతీయ జాతీయ గణాంక శాఖ స్టాల్ ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గణాంక, పథకాల అమలు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న హైదరాబాద్ ప్రాంతీయ జాతీయ గణాంక కార్యాలయం అధికారులు నుమాయిష్-2025లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.అజిత్ కుమార్ ప్రారంభించారు. సాంఖ్యక శాస్త్ర ప్రాముఖ్యత, దేశఅభివృద్ధిలో గణాంకాల పాత్ర, విశ్వసనీయమైన సమాచారాన్ని సేకరించి దేశ ప్రణాళిక రచనలో కీలక భాగస్వామ్యం అవుతున్న ఎన్ఎస్ఓ డేటా యొక్క ప్రాముఖ్యత గురించి ఈ స్టాల్‌లో అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ దేశంలో ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించే సర్వేలు మరియు వాటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. ప్రణాళిక రచనలో వాటి యొక్క కీలక భాగస్వామ్యాన్ని అందరు గుర్తించాలని ఈ స్టాల్‌లో పొందుపరిచిన సమాచారం అందరూ తెలుసుకొని భవిష్యత్తులో ఎన్ఎస్ఎస్ఓ జరిపే అన్ని సర్వేలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతి రెడ్డి, సీనియర్ స్టాటిస్టికల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని ఆలయాలు

- అటకెక్కిన నాచగిరి, కొండపోచమ్మ ఆలయాల మాస్టర్ ప్లాన్
- పెండింగ్‌లో వరదరాజస్వామి ఆలయ పనులు
- ఉమామహేశ్వర, సీతారామస్వామి ఆలయంలోనూ అసంపూర్తిగానే
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి, దేవాదాయశాఖ మాత్యులు కొండా సురేఖ ప్రత్యేక చొరవ తీసుకుంటే పనులు పూర్తయ్యే అవకాశం

గజ్వేల్, జనవరి 5, (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లో అత్యంత ప్రాచుర్యం కలిగిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్‌లో కొలువై ఉన్న కొండపోచమ్మ ఆలయం, దక్షిణ కంచిగా పేరుగాంచిన వరదరాజస్వామి ఆలయం, గజ్వేల్‌లోని 400 ఏళ్ల చరిత్ర కలిగిన శివకేశవుల ఆలయాల అభివృద్ధి అటకెక్కినట్లే కనిపిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా చేపట్టిన వరదరాజస్వామి దేవాలయ పనులు పెండింగ్‌లో పడ్డాయి. గజ్వేల్‌లోని సీతారామ, ఉమామహేశ్వర స్వామి ఆలయ పనులు కూడా నిలిచిపోయాయి. ఇక యాదాద్రి తరహాలో నాచగిరి లక్ష్మీనరిసంహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, రూ.50 కోట్లతో మాస్టర్ ప్లాన్ వేయించి అద్భుత తరహాలో అభివృద్ధి చేస్తామని, రూ.10కోట్లతో కొండపోచమ్మ ఆలయ రూపురేఖలు మారుస్తామని గత ప్రభుత్వం ఢంకా బజాయించి చెప్పినప్పటికి ఒక్క అడుగు ముందరపడలేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఉండడంతో ప్రత్యేక చొరవ తీసుకుంటే ఆలయాల అభివృద్ధి జరుగుతుందని పలువురు భక్తులు కోరుకుంటున్నారు.



వర్గల్ మండలం నాచారంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం

చరిత్ర కలిగిన ఆలయాలు

కొమురవెల్లి మల్లన్న చెల్లెలిగా మల్లికార్జునస్వామి దర్శన అనంతరం కొండపోచమ్మను దర్శించుకుంటేనే ముక్తి లభిస్తుందన్న నానుడితో ఆలయం విశేషస్థాయిలో ప్రాచుర్యం పొందింది. భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతుంది. జనవరి మొదలు ఏప్రిల్ వరకు ఇక్కడ మూడు నెలల పాటు జాతర సాగుతుంది. ప్రస్తుతం జాతర జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు లేక, సరైన వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గజ్వేల్ అభివృద్ధి చెందిందని చెబుతున్నా ఆలయాల అభివృద్ధి మాత్రం కుంటుపడింది. ప్రతీ ఆది, సోమ, మంగళ వారాల్లో భక్తులు ఈ ఆలయానికి వస్తుంటారు. గతంలో కొమురవెల్లి వరంగల్ జిల్లాలో, కొండపోచమ్మ ఆలయం మెదక్ జిల్లాలో ఉండడంతో ఇరు దేవాలయాల అభివృద్ధికి కొంత గ్యాప్ ఉండేది. కానీ ప్రస్తుతం జిల్లాల పునర్విభజన అనంతరం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం, కొండపోచమ్మ ఆలయాలు సిద్దిపేట జిల్లాలోకి రావడంతో దేవాలయాలకు వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతుంది.



జగదేవ్‌పూర్ మండలం తీగుల్ నర్సాపూర్‌లోని కొండపోచమ్మ ఆలయం

గత ప్రభుత్వ పెద్దల మాట ఉత్తదే..

కొండపోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని 2020వ సంవత్సరం మే 29న కొండపోచమ్మసాగర్ జలాశయం ప్రారంభం సందర్భంగా అప్పటి సీఎం, ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇక నాచగిరి ఆలయం కొన్ని వందల సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నది. ప్రాచీన హరిద్రా నది ఒడ్డున కొలువై ఉన్న నాచగిరి లక్ష్మీనర్సింహ స్వామి వారు భక్తులు కోర్కెలు తీరుస్తున్నాడు. అద్భుతమైన మాస్టర్ ప్లాన్‌తో ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని 2015లో గత ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ ఈ ప్రకటనలు కేవలం మాటలుగా మిగిలిపోయాయి.

మంత్రి నిధులు ఇచ్చేనా...?

గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రముఖ ఆలయాలైన నాచగిరి, కొండపోచమ్మ ఆలయాలతో పాటు జీర్ణోద్ధరణ జరుగుతున్న వరదరాజస్వామి ఆలయానికి, గజ్వేల్‌లో చివరి దశలో ఉన్న ఉమామహేశ్వర, సీతారామచంద్రుల ఆలయ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆలయంలో మాడవీధులు, గోపురాల నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఈ పెండింగ్ పనులు పూర్తి చేయడానికి నిధులు విడుదల చేస్తుందా అన్న ప్రశ్న

మిగతా 8వ పేజీలో...

న్యూస్ బాక్స్

పెద్దసారు కలుస్తలేరు

తూప్రాన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పార్టీ ఇబ్బందులకు గురైనా కష్టపడి అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దసారు (కేసీఆర్)ను గెలిపించుకున్నాం, గెలిచిన తర్వాత మమ్మల్ని కలువడం లేదు. అసలే కనిపించకుండా పోతే కార్యకర్తల కష్టసుఖాలను ఎవరు పట్టించుకుంటారు' అంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తూప్రాన్ మండలం ఇమాంపూర్ శివారులో బీఆర్ఎస్ పార్టీ మనోహరాబాద్ మండల సమావేశాన్ని జిల్లా నాయకులుర్యాకల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. కేసీఆర్ ఫాంహౌజ్‌లో కూడా తమను కలవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం మండల అధ్యక్షుడు పార్టీని వీడితే ఇప్పటికీ అధ్యక్షుడిని నియమించలేదని అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా తమను పట్టించుకోవడం లేదని, కనీసం ఇక్కడికి రావడంలేదని పేర్కొన్నారు.

కలెక్టరేట్‌కు తరలిరావాలి

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ నేడు సిద్దిపేట కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్నట్లు జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు ఆదివారం ప్రకటనలో తెలిపారు ఈ ఆందోళన కార్యక్రమానికి చేర్యాల నుంచి అన్నివర్గాల ప్రజలు తరలిరావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మోడల్‌స్కూల్‌లో 6నుంచి 10వతరగతి వరకు ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని తెలిపారు. నేటి నుంచి 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10 తరగతుల్లో సీట్ల భర్తీకి దర ఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

మాటల్లో రూ.కోట్లు..చేతల్లో కోతలు

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి హరీశ్ విమర్శలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎగవేతలు, కోతలు తప్ప పాలనపై పట్టులేదని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నంగునూర్ మండల యువజన విభాగం నాయకులతో ఆయన సమావేశమయ్యారు. కాంగ్రెస్ పాలనలో మాటలు కోటలు దాటుతున్నాయని, చేతల్లో మాత్రం కోతలు, ఎగవేతలేనని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఆపేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీ ల్లో కూడా మహాలక్ష్మీ పథకం ద్వారా రూ.2,500 ఊసే లేదని, తులం బంగారం మాటనే లేదని, రుణమాఫీ సగమే చేశారన్నారు.



యువజన విభాగం నాయకులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రశ్నించారు. వీటిపై సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. సిద్దిపేట అభివృద్ధి మీకు అవసరం లేదా అని ప్రశ్నించారు. సిద్దిపేట అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభమయ్యే వరకు తానూ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

సిద్దిపేట అభివృద్ధిపై కక్ష కట్టారు

పదేళ్లలో పరుగులు పెట్టిన సిద్దిపేట అభివృద్ధి ఏడాదిలో వెనుకబడిందని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులు రద్దు చేయడమేంటని ప్రశ్నించారు. శిల్పారామం, రంగనాయక సాగర్ టూరిజం, ఆసుపత్రి, రోడ్లు ఇలా చాలా పనులను మధ్యలోనే ఆపేశారని, కొత్తవి ఇవ్వకపోగా, పాత వాటికి కూడా అడ్డుపడటమేంటని

వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భవిష్యత్ అంతా యువతదేనని హరీశ్‌రావు అన్నారు. రాజకీయాల్లో యువత ముందు వరుసలో ఉండాలన్నారు. రాబోయే రోజుల్లో యువతకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గత పదేళ్లలో వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ఏడాదిగా నిలిచిపోయిన పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా సమర్థ పాలన

- పర్యాటకులను ఆకట్టుకునేలా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు అభివృద్ధి
- పట్టణంలో మరిన్ని జంక్షన్లను అభివృద్ధి చేస్తాం
- ప్రతీ కుల సంఘానికీ రూ. 45 లక్షలతో కమ్యూనిటీహాళ్లు
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్‌లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా కూడా కాంగ్రెస్‌కు ఉన్న అనుభవంతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎక్కడా తగ్గకుండా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆయన హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులు, రూ.18 కోట్లతో చేపట్టబోయే ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేసి అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, భూమి లేని రైతు కూలీలకు రూ.12వేలు వంటి పథకాలను సంక్రాంతి తర్వాత ప్రారంభిస్తామన్నారు. చరిత్ర కలిగిన హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును రూ. 18 కోట్లతో పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరీకరణ పనులు చేయిస్తున్నామన్నారు. ఇప్పటికే పట్టణంలోని జంక్షన్ల సుందరీకరణ చేయిస్తున్నామని, మరికొన్ని జంక్షనను కూడా అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి కుల సంఘానికి రూ. 45 లక్షలతో కమ్యూనిటీ హాళ్ళ నిర్మాణం చేయిస్తున్నామని, ఇంకా రూ 17కోట్లు మంజూరుకావాల్సి ఉందని, వీటితో పల్లె చెరువు, కొత్త చెరువులను సుందరీకరిస్తామన్నారు, హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వెల్లడించారు. రైతుబజార్, మార్కెట్ యార్డులో నూతన గోదాంతో పాటు పలు కుల సంఘాల కమ్యూనిటీ హాళ్ల, సీసీరోడ్డు, మురుగు కాలువలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఆర్డీవో రామ్మూర్తి, కమిషనర్ మల్లిఖార్జున్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కౌన్సిలర్లు కొంకటి నళినిదేవి, చిత్తారి పద్మచ పున్న లావణ్య, పెరుక భాగ్యరెడ్డి, కోమటి స్వర్ణలత, వల్లపు రాజు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, నాయకులు చిత్తారి రవీందర్, బంక చందు, ఎగ్గిడి అయిలయ్య, ఎండి హసన్, రాజు తదితరులున్నారు.

డెడ్ బాడీ ఫ్రీజర్ వితరణ

హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1989-90 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం డెడ్ బాడీ ఫ్రీజర్ (శవపేటిక)ను కొనుగోలు చేసి మున్సిపాలిటికీ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లిఖార్జున్ పూర్వ విద్యార్థులు గాలిపల్లి రమణ్ బాబు, ప్రతాపగిరి శ్రీనివాస్, రమేశ్, సంజీవ్, గాజుల మహేశ్, సత్యం, శంకర్‌రెడ్డి, పద్మనాభం, మహేందర్, ఆంజనేయులు, రామ్‌శ్రీను ఉన్నారు.

దయచేసి మాకు డిగ్రీ చదివే అవకాశం కల్పించండి

- గురుకుల కళాశాల్లోనే డిగ్రీ ఏర్పాటు చేయండి
- మంత్రి పొన్నంకు గురుకుల విద్యార్థినుల విన్నపం
- లేకపోతే ఇంటర్ అవ్వగానే ఇంట్లో పెళ్లి చేస్తారని ముస్లిం విద్యార్థినుల ఆవేదన



మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ముచ్చటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తమకు డిగ్రీ చదివే అవకాశం కల్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురుకుల విద్యార్థినులు విజ్ఞప్తి చేశారు. పొన్నం ప్రభాకర్ ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను, కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థినులు డిగ్రీ కూడా ఇక్కడే చదువుకునేందుకు అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. తాము ఇంటర్ పూర్తి చేసి ఇంటికి వెళ్లగానే తల్లిదండ్రులు పెళ్లి చేసేస్తారని ముస్లిం విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకూ ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు చేయాలని ఉందని చెప్పారు. మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలను డిగ్రీ వరకు అప్‌డేట్ చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం అప్పటికప్పుడు మైనార్టీ సంక్షేమశాఖ స్పెషల్ సెక్రటరీ తాఫ్సీర్ ఇక్బాల్, సీఎం సెక్రెటరీ షానవాజ్ ఖాసీంతో ఫోన్‌లో మాట్లాడారు. మైనార్టీ గురుకులల్లో తప్పకుండా డిగ్రీ చదివేందుకు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. పెంచిన డైట్ చార్జీల తర్వాత అమలవుతున్న మెనూపై ఆరా తీశారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అలాగే బీసీ సంక్షేమ శాఖ బాలుర ప్రీ మెట్రిక్ హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు.

మల్లన్నకు దండిగా మొక్కుల సమర్పణ

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజనసందోహంగా మారాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడిగా తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. బోనం నివేదించి, చలక, నజరు, ముఖ మండపంలో పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్నాలు వేసిన భక్తులతో ముఖ మండపం, గంగిరేగు చెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారాయి. గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. బుకింగ్ కార్యాలయం ఆవరణలో నిలువ నీడ లేకపోవడంతో పట్నాలు, బోనాల టికెట్లతో పాటు ప్రసాదాల కోసం భక్తులు నిమిషాల తరబడి బారులు తీరి ఇబ్బందులుపడ్డారు. ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు ఏర్పాట్లుపర్యవేక్షించారు.

బుకింగ్ కౌంటర్ వద్ద ఇబ్బందులు

స్వామివారి దర్శనార్థం ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చిన క్రమంలో పట్నాలు,బోనాలు, అర్జిత సేవాటికెట్లతో పాటు ప్రసాదం కోసం తీవ్ర ఇబ్బందులుపడ్డారు. 4కౌంటర్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం రెండు కౌంటర్ల ద్వారా మాత్రమే ప్రసాదం, మొక్కుబడి టికెట్లు అందించడంతో ఎండలోనే క్యూలైన్‌లో పడిగాపులు కాసి ఇబ్బందులు పడ్డారు. మూడు నెలల జాతరకోసం భక్తులకు సేవలందించేందుకు వాలంటీర్లనునియమించుకున్నప్పటికీ ఆలయాధి కారులు బుకింగ్ కార్యాలయం వద్ద టికెట్ల జారీకి వినియోగించకపోవడంతో భక్తులకు తిప్పలు తప్పడం లేదు. ఈనెల 19వతేదీ నుండి మహాజాతర ప్రారంభం కానుండటంతో భక్తులు వేలాదిగా తరలిరానున్నందున ఆలయాధికా రులు చొద్యంవీడి అందుబా టులోఉన్న అన్ని కౌంటర్లు తెరవడంతో పాటు రద్దీ దృష్ట్యా మహిళలకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేయాలని భక్తులు కోరుతున్నారు.



మల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు

సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వొద్దు

- ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి
- సర్వశిక్షా ఉద్యోగుల డిమాండ్ న్యాయమైంది
- చాడ వెంకటరెడ్డి

7

ఔర్ ఏక్ దక్కా... వర్గీకరణ పక్కా

- ఫిబ్రవరి 7న లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల కార్యక్రమం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

గజ్వేల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఔర్ ఏక్ దక్కా.. ఎస్సీ వర్గీకరణ పక్కా అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆదివారం నిర్వహించిన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు అనుకూలంగానే ఉన్నారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ఓ మంత్రి ఆర్డినెన్స్ తేకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. 30 ఏళ్ల పోరాటం అందరి మద్దతు, అనేక త్యాగాలు, పోరాటాలతో తుది దశకు చేరుకుందని, మరోసారి గట్టిగా పోరాడితే వర్గీకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీసీ సంఘం నాయకుడు ఆర్ కృష్ణయ్య పదేళ్లలో ఐదు కండువాలు మార్చారని, తాను మాత్రం వర్గీకరణే ధ్యేయంగా పని చేస్తున్నానని తెలిపారు. పదవులు ముఖ్యం కాదని, వర్గీకరణ సాధిస్తే వచ్చే వంద తరాలు బాగుపడతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, టీడీ పీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం పెద్దలతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, వారందరితోనూ వర్గీకరణ కోసమే మాట్లాడానని తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరుగబోయే లక్ష డప్పులు, వెయ్యిగొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రభుత్వ విధానాలతో నష్టాల్లోకి విద్యుత్ సంస్థలు

- విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే సమ్మె తప్పదు
- ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్

7

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- అంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా విషయంలో రైతులను మోసం చేసిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరానికి ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా పథకం కింద ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పి, ప్రస్తుతం రూ.12 వేలకే పరిమితం చేసిందని మండిపడ్డారు. వానాకాలం సీజన్‌లో అసలే ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకుని ఈనెల 26 వరకు రైతులందరికీ రూ.15 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ముందు సాగునీటిని అందించి, సాగు భూములకే భరోసా ఇస్తామని తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మనూరు మండల అధ్యక్షుడు విఠల్‌రావుపాటిల్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పరశురాం, కౌన్సిలర్ కవితావిఠల్, పట్టణ అధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లూరు బండపై వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

సిద్దిపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయం వంశపారంపర్య అర్చకుడు కలకుంట్ల రంగాచార్య తెలిపారు. ఆదివారం బండపై ఆలయం వద్ద కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంభువుగా వెలసిన పుల్లూరు బండ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఉదయం నుంచి విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించి ఉత్తర ద్వారం గుండా స్వామిని ఆలయంలోకి తీసుకెళతామని తెలిపారు. అనంతరం స్వామి వారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పొడిచేటి శ్రీనివాసాచారి, పుల్లూరు బండ దేవస్థాన కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎజాజ్‌ఖాన్, తదితరులు

జహీరాబాద్, జనవరి5(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఆదివారం అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఫుట్‌బాల్ కోచ్ ఏజాజ్‌పాషా, టోర్నమెంట్ అధ్యక్షుడు రాములు నేత, తదితరులు పాల్గొని క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రారంభించారు. మొదటిరోజు జైసేవాలాల్ సీసీ-సాహసీసీ జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో నాయకులు నామరవికిరణ్, జ్యోతిపండాల్, అబ్దుల్లా, మహబూబ్, అఫ్సర్ దిల్దార్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తక్షణమే చేపట్టాలి

- మహాజన సోషలిస్టు పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ

ఝరాసంగం, జనవరి5(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తక్షణమే చేపట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఝరాసంగం మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వేయిగొంతులు - లక్ష డప్పుల మహా ప్రదర్శనకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



కె.ప్రేమలకు(ద్వితీయ) జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు



ఎన్.రోజాకు(తృతీయ) జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు



మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ స్కూల్‌లో ముగ్గు వేస్తున్న మహిళ



నారాయణుడి ముగ్గు వేస్తున్న యువతి





సంగారెడ్డి జిల్లా ముత్యాల ముగ్గుల పోటీల ప్రథమ విజేత కె.స్వప్నకు జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు, ముగ్గు వేస్తూ జయారెడ్డి

ముగ్గులాలికే..

సందడిగా ముత్యాల ముగ్గుల పోటీలు

యువతులు, మహిళలు వేసిన రంగవల్లులు భువిపై హరివిల్లును తలపించాయి. సంక్రాంతి పండుగ ముందే తెచ్చింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్ఫెక్ట్... ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్).. ఆదివారం సంగారెడ్డి పట్టణం శాంతినగర్‌లో వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల వేదికగా పండుగ వాతావరణంలో సాగింది.









సిద్దిపేటలో వేసిన ముగ్గు



సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



సిద్దిపేటలో ముగ్గు వేస్తున్న యువతి

పెళ్లికి పెద్దలు నిరాకరిస్తారని..

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- యువకుడి మృతి
- నిలకడగా యువతి ఆరోగ్యం



సాగర్ (ఫైల్)

సిద్దిపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై ప్రేమించుకున్నారు.. వారి ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరిస్తారని ఆ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా, యువతి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నది. ఈ ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలో చోటుచేసుకోగా ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన రామంచ సాగర్(22) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాగర్‌కు మూడు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతి పరిచయమైంది. వారి పరిచయం ప్రేమగా మారింది. వీరి ప్రేమను కుటుంబసభ్యులు అంగీకరించరనే భావనతో డిసెంబరు 22వ తేదీన సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం సాగర్ తన కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, ప్రేమికులిద్దరు బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. సాగర్ కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని వారిని మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాగర్ ఆదివారం మృతి చెందాడు. యువతి ఆరోగ్యం నిలకడగా ఉంది. సాగర్ సోదరుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం

ఢీకొని ఒకరి మృతి



తాటిపాముల కనకయ్య మృతదేహం

జగదేవ్‌పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌కు చెందిన తాటిపాముల కనకయ్య(60) స్థానిక కేశిరెడ్డి ఫంక్షన్‌హాల్ వైపు వెళ్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో నష్టాల్లోకి విద్యుత్ సంస్థలు

- విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే సమ్మె తప్పదు
- ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్
- రెండో రోజు కొనసాగిన మహాసభలు



మాట్లాడుతున్న ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్

సిద్దిపేట అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధానాలతో విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి వెళుతున్నాయని, వాటిని సాకుగా చూపి విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి మోదీ సర్కార్ ప్రయత్నాలు చేస్తుందని ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్ ఆరోపించారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీయూఈఈయూ) రాష్ట్ర నాలుగో మహాసభలు రెండో రోజైన ఆదివారం సిద్దిపేటలో కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, అధ్యక్షుడు ఈశ్వరయ్యతో కలిసి సుదీప్ దత్ మాట్లాడారు. చండీఘర్, రాజస్థాన్‌లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రం ప్రయత్నించగా, వాటిని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో 48 జిల్లాలలో ప్రైవేట్ సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పగించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ అందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రెండేళ్లలో పూర్తి చేయాల్సిన యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏడేళ్ల నుంచి నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, చండీగర్‌లో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణతో ఉద్యోగులు, రైతులు, ప్రజలందరికీ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. బోరుబావులపై ఆధారపడి పని చేస్తున్న రైతులందరిపై భారం పడుతుందని, అప్పుడు వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతుందని స్పష్టం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న వారందరమూ ఏకమై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన రాళ్ల బండి శశిధర్, యూనియన్ కంపెనీ అధ్యక్షుడు సింగిరెడ్డి చంద్రారెడ్డి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాట మధు, యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటుపల్లి సధాకర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ర్యాకం అశోక్, నాయకులు, జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వొద్దు

- ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి
- సర్వ శిక్షా ఉద్యోగుల డిమాండ్ న్యాయమైంది
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖను మొదట ప్రక్షాళన చేయాలన్నారు. కొత్త రెవెన్యూ చట్టం ద్వారా అయినా రైతులకు మేలు జరగేలా చూడాలని కోరారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, నిరుపేదలను గుర్తించి వారికి న్యాయం చేయాలని అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్ న్యాయమైందని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల డిమాండ్‌పై జీవో విడుదల చేయాలని కోరారు. సీపీఐ శత ఆవిర్భావ వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 99 సంవత్సరాలుగా సీపీఐ పార్టీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందని, ఎన్నో ఉద్యమాలను నిర్వహించిందని అన్నారు. మోదీ ప్రభుత్వం మతోన్మాదంతో ప్రజలను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జమిలి ఎన్నికలతో ప్రమాద సూచికలు కనిపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కనుసైగలలో పని చేస్తుందని విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజాసంఘాలే ప్రధాన పట్టుకొమ్మలని చాడ వెంకట్‌రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అన్నారు. సీపీఐ, అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను గుర్తు చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో సభ్యత్వ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు గడిపే మల్లేష్, కిష్టాపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, గణేష్, అశోక్, వెంకటరెడ్డి, జనార్దన్, మధు, నరేష్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు

సిద్దిపేట రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన ఓ యువతిని చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన నిఖిల్‌రెడ్డి ఐదేళ్ల నుంచి ప్రేమిస్తున్నానని చెప్పి దగ్గరయ్యాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువతికి సంబంధించిన న్యూడ్ ఫొటోలను తీసి, ఇంటర్నెట్‌లో పెడతారని భయపెడుతూ ఆమెను బెదరించాడు. కాగా, ఇటీవల ఆ యువకుడికి మరో యువతితో ఎంగేజ్మెంట్ జరగింది. తన పెళ్లికి అడ్డు రావద్దని, తాను వేరే వివాహం చేసుకుంటున్నానని నిఖిల్‌రెడ్డి యువతితో చెప్పడంతో ఆమె సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

ఖోఖో రిజిస్టర్ సొసైటీల జాబితాను అందజేయండి

ఫుల్‌కల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలాల వారీగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఖోఖో సొసైటీల డాక్యుమెంట్‌లను అడ్‌హక్ కమిటీకి ఇవ్వాలని ఖోఖో ఉమ్మడి మెదక్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వై.మహేందరావు తెలిపారు. 7వ తేదీలోగా ఖోఖో అడ్‌హక్ కమిటీ సభ్యుడు, చేగుంట మండలం వడియారం పాఠశాల పీడీ ఎస్.నాగరాజుకు అందజేయాలని ఆయన సూచించారు. ఈ జాబితాను అనుసరించి ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు.

ప్రతీ గ్రామంలో

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మనోహరాబాద్ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ద్వారానే సరైన సమయంలో కేసులను త్వరగా ఛేదించవచ్చని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన దాత దోమకొండ వేంకటరమణ సహకారంతో ఏర్పాటు చేసిన 68 సీసీ కెమెరాలను ఎస్పీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత గ్రామం కోసం ఏదో చేయాలని అడగకుండానే వెంకటరమణ తన సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. మనోహరాబాద్ మండలం పరిశ్రమలహబ్‌గా మారిందని, ఇతర రాష్ట్రల నుంచి అనేక మంది కార్మికులు, గుర్తుతెలియని వారు వస్తున్నారన్నారు. నేరాలు జరిగినప్పుడు వారిని త్వరితగతిన పట్టుకోవాలంటే సీసీ కెమెరాలు ముఖ్యం అన్నారు. ముఖ్యమంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి నెలంతా రోడ్డు భద్రతా దినోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా మనోహరాబాద్ జాతీయ రహదారి గుండా 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తూప్రాన్ సీఐ రంగా కృష్ణ, దాత దోమకొండ వెంకటరమణ, అనిత, అఖిల్, అక్షయ్, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, డీఐ రవికూమార్, బాలయ్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గాలిపటాల దుకాణాల్లో తనిఖీలు

సిద్దిపేట క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాలిపటాల దుకాణాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా దుకాణాల్లో ఉన్నా, ఎవరైనా విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదకరమని తెలిపారు. బైక్‌పై వెళ్లే వారి మెడకు, కాళ్లకు తట్టుకొని చనిపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. పర్యవరణానికి విపత్తుగా ఉండడంతో జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న సిద్దిపేట టూటౌన్ పోలీసులు

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి


తాడూరు గ్రామస్థులతో మంత్రి కోమటిరెడ్డి

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడూరు గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, అభివృద్ధి పనులకు నిధులు మంజూరుచేయాలని కోరుతూ గ్రామస్థులు ఆదివారం రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హైదరాబాదులో వారిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. తాడూరు గ్రామశివారులో వాగుపై బ్రిడ్జి నిర్మాణం, ఇతర మౌళికవసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ కొమ్ము నర్సింగరావు, బీసీ కమిషన్ చైర్మన్ రంగు బాలలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నేటికీ అందని ద్రాక్షగా 'ఆర్టీసీ'

- గ్రామాలకు అందని 'పల్లె వెలుగు' సేవలు
- బడి ఉంటేనే బస్సు... లేదంటే అంతే
- రాయపోల్ మండలంలో సగానికి పైగా బస్సులు రాని పల్లెలే



అనాజీపూర్, మంతూర్ గ్రామాల మీదుగా దౌల్తాబాద్ మోడల్ స్కూల్‌కు వెళ్తున్న బస్సు


వీరానగర్ నుంచి బస్సు కోసం సుమారు రెండు కిలోమీటర్లు వరకు నడిచి వెళ్తున్న విద్యార్థులు, మహిళ

రాయపోల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ 'పల్లె వెలుగు' పేరిట బస్సులను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే పల్లె వెలుగు బస్సులు రాని గ్రామాలు నేటికీ కోకొల్లలుగా ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి సమీపంలో ఉన్న రాయపోల్ మండలంలో సుమారు సగం గ్రామాలకు అసలు పల్లె వెలుగు బస్సులే రావు. మరో సగం గ్రామాలకు పాఠశాలలు ఉంటేనే బస్సు వస్తుంది.

నాలుగైదు గ్రామాలకే బస్సు సౌకర్యం

రాయపోల్ మండలంలో కేవలం నాలుగైదు గ్రామాలకు మాత్రమే నిరంతర బస్సుల సౌకర్యం ఉన్నది. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా మధిర గ్రామాలను కలిపితే మొత్తం 25 గ్రామాలున్నాయి. మండలంలోని ఆరేపల్లి, లింగారెడ్డిపల్లి, కిష్టాసాగర్, రాయపోల్, తిమ్మక్కపల్లి గ్రామాలకు మాత్రమే నిరంతరం ఆర్టీసీ బస్సు సేవలందుతున్నాయి. మండలంలోని అనాజీపూర్, మంతూరు, ఎల్కల్, బేగంపేట, వడ్డెపల్లి, సయ్యద్‌నగర్, రామారం, గొల్లపల్లి, అంకిరెడ్డిపల్లి, రాంసాగర్ గ్రామాలకు మాత్రమే విద్యార్థుల కోసం బస్సులు వస్తున్నాయి. గ్రామాలకు విద్యాసంస్థలు తెరిచి ఉన్న రోజుల్లో తప్ప సెలవు రోజుల్లో బస్సు కనిపించదు. ఆ వచ్చే బస్సులు కూడా విద్యార్థుల సమయాలకు అనుగుణంగానే రావడంతో ప్రయాణికులకు అంతగా ఉపయోగపడవు.

బస్సు కోసం 2, 3 కిలోమీటర్లు నడవాల్సిందే

ఇదిలా ఉండగా దొడ్లపల్లి, వీరారెడ్డిపల్లి, ఉదయ్‌పూర్, టెంకంపేట, వీరానగర్, ఎస్సీ కాలనీ, ముంగీస్‌పల్లి, చిన్నమాసాన్‌పల్లి, కొత్తపల్లి, చౌదరిపాలెం గ్రామాలకు అసలు ఆర్టీసీ బస్సు రావడం లేదు. ఈ గ్రామాల విద్యార్థులు, ప్రజలు బస్సుల కోసం సమీప గ్రామాలు లేదా మెయిన్‌రోడ్డుకు రెండు లేదా మూడు కిలోమీటర్ల వరకు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. వీటిలో కొన్ని గ్రామాలకు మూడేళ్ల క్రితం వరకు విద్యార్థుల కోసం బస్సులు వచ్చేవి. కారణం తెలియదు కానీ వాటిని నిలిపివేశారు. వీరారెడ్డిపల్లికి చెందిన విద్యార్థులయితే ఏకంగా ఓ ఆటోను కిరాయికి మాట్లాడుకుని గజ్వేల్‌కు చదువుకోవడం కోసం వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మారుమూల గ్రామాలకు నిరంతర బస్సు సౌకర్యం కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అదృశ్యమైన వృద్ధురాలు.. మృతదేహంగా లభ్యం

గజ్వేల్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ఆర్ కాలనీలో ఆదివారం వెలుగుచూసింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్అండ్ఆర్ కాలనీలోని వేములఘాట్‌కు చెందిన డప్పు పోచమ్మ(70) కుటుంబ సభ్యులతో కాకుండా ఓ ఇంట్లో వేరుగా ఉంటోంది. 4 రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన పోచమ్మ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఫలితం లేకపోయింది. సంగాపూర్ మార్గంలో ఆర్అండ్ఆర్ కాలనీ సమీపంలోని ఓ బావిలో మహిళ మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళ మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

గజ్వేల్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత నెల 29న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామానికి చెందిన బత్తిని సాగర్(22) ఫ్రిజ్, ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో తన మిత్రుడు సంతోష్‌తో కలిసి నివాసముంటున్నాడు. గత నెల 29న రాత్రి బైక్‌పై గుండన్నపల్లి నుంచి ముట్రాజ్‌పల్లికి వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో ఢీకొని కిందపడిన సాగర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సాగర్ ఆదివారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి


వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్న వన్ టౌన్ సీఐ వాసుదేవరావు

సిద్దిపేట క్రైం/ గజ్వేల్/ చేర్యాల/ మద్దూరు/ ములుగు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జిల్లాలోని పలు మండలాల్లో ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లకు పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ రాజీవ్ రహదారి కేసీఆర్‌నగర్ వద్ద, వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు సిద్దిపేట పాతబస్టాండ్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మితిమీరిన వేగం హెల్మెట్ లేకుండా ప్రయాణించడం రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నియమ, నిబంధనల గూర్చి అవగాహన కల్పించారు. ఆయనవెంట ట్రాఫిక్ సిబ్బంది వెంకటరమణారెడ్డి, జగదీశ్వర్ తదితరులున్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో ఆటో డ్రైవర్లకు చేర్యాల సీఐ ఎల్ .శ్రీను రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపట్ల అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే చేర్యాల పట్టణంలో ఎస్ఐ నీరేశ్ వాహనదారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మద్దూరుమండలంలోని లద్నూరు గ్రామంలో గ్రామస్థులకు ఏఎస్ఐ విజయ్‌కుమార్ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ములుగు మండలం కొత్తూరు గ్రామంలో పోలీస్ కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుగ్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ములుగు ఏఎస్ఐలు మధుసూదన్, అండాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చాడ వెంకటరెడ్డిని కలిసిన జగ్గు మల్లారెడ్డి


చాడ వెంకటరెడ్డితో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డిని కరీంనగర్ నియోజకవర్గ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమకు సీపీఐ పార్టీ తరఫున మద్దతు ఉండాలని మల్లారెడ్డి అడగగా సానుకూలంగా స్పందించిన చాడ ఎన్నికలలో మీరు విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. వారివెంట సిద్దిపేట సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు సంపత్ కుమార్, చంద్రం, తదితరులు ఉన్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిత్యం ద్రవిడ ప్రబంధ సేవాకాలం తిరుప్పావై, పాశుర విన్నపం, గోదాష్టోత్తర పఠనం తదితర పూజాధికాలు వైదిక సంప్రదాయంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం 21వరోజును పురస్కరించుకుని మహిళలు ఆలయ ఆవరణలో గోదా అక్షర మాలగా కూర్చుని పారాయణం చేశారు.

పురుగుల మందు తాగిన వృద్ధుడు...


సాయిలు (ఫైల్)

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మోకాళ్ల నొప్పులు భరించలేక ఇటీవల ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన ఎంటె సాయిలు(65) ఆదివారం మృతి చెందాడు. మూడేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న క్రమంలో ఈ నెల 28న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడటంతో చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కొమురవెల్లి పోలీసులు కేసునమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి.. ఆరుగురిపై కేసు

- రూ.10 వేలు, 6 సెల్‌ఫోన్లు, 6 బైక్‌లు స్వాధీనం

సిద్దిపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, సిద్దిపేట రూరల్ పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. ఈ సంఘటన సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతమడక గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి పౌల్ట్రీ ఫామ్ షెడ్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారమందడంతో దాడి చేయగా ఆరుగురు వ్యక్తులు పేకాడుతూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, రూ.10,060 నగదు, 6 సెల్ ఫోన్‌లు, 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత

దౌల్తాబాద్/ములుగు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా రికవరి చేసిన పోలీసులు వాటిని ఆదివారం బాధితులకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన దేవిగారి బాబు, చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన వేమ శ్రీను రూ. వేలు విలువ చేసే తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ఉపయోగించి ఆ సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఆదివారం ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్, ఏఎస్ఐ బీక్యా నాయక్ బాధితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వారు పోగొట్టుకున్న సెల్ ఫోన్లను అందజేశారు. అదేవిధంగా ములుగు మండలకేంద్రానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి గత సంవత్సరం డిసెంబరు 13న గ్రామంలో సెల్‌ఫోన్ పోయిందని ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్‌ను రికవరీ చేసి ఆదివారం బాధితుడికి అందజేసినట్టు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

శ్రీనగర్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చేర్యాల పట్టణంలోని శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా బర్రె శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అండె సుధాకర్‌రెడ్డి, కోశాధికారిగా పెంటపర్తి కొండల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా మెట్టు అయిలయ్య, ఉపాధ్యక్షులుగా చింతలవేణుగోపాల్, బుడిగె శ్రీనివాస్, కార్యదర్శులుగా శాడగొండ సంజీవరెడ్డి, బైర నరహరి, సలహాదారులుగా మంద లక్ష్మారెడ్డి, తుపాకుల బాబు, ఆడిట్ కమిటీ సభ్యులుగా గుంటి బుచ్చయ్య, కూర పాటి మల్లేశం, వీఆర్‌వోగా బొంగు చంద్రారెడ్డి ఎన్నికయ్యారు.

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు చేయూత

చేర్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులను కోల్పోయిన ఇరువురు చిన్నారులకు మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి అండగా నిలిచారు. మండలంలోని పెద్దరాజుపేట గ్రామానికి చెందిన కూలీ మేకల రమేశ్ (35)కు భార్యతో పాటు ఇరువురు కూతుళ్ల సంతానం. చాన్నాళ్లక్రితం భార్య అస్వస్థతతకు గురై చనిపోయింది. హైదరాబాద్‌లో స్వీపర్ ఉద్యోగం చేస్తూ కూతుళ్లను పోషించాడు. ఈ క్రమంలో అతడు కూడా అనారోగ్యానికి గురై ఆదివారం చనిపోయాడు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల పరిస్థితి గురించి తెలుసుకున్న మొగుళ్ల రాజిరెడ్డి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాడు. ఇద్దరు ఆడపిల్లల చదవుకయ్యే స్కూలు ఫీజు భరిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు ఆయన తరుపున మొగుళ్ల రాజన్న సోషల్‌మీడియా టీంసభ్యులు మేడిపల్లి చందు, ఎం.రమేశ్, సొంటె స్వామి, పాపి శ్రీనివాస్ తదితరులు మృతుడి తల్లి, చిన్నారులను ఓదార్చి ఆర్థిక సహాయంఅందించారు.

జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతాం


జ్యోతి వెలిగించి సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న అల్లం నారాయణ

గజ్వేల్ రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జర్నలిస్టుల ఆరోగ్యం కొరకు రూ. 35 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులను కేటాయించామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ. కోటి ఉన్న బడ్జెట్‌ను వంద కోట్లకు తీసుకువెళ్లిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు అనంతరం గజ్వేల్ నియోజకవర్గ టీయూడబ్ల్యూజే కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గరిఆదా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బలరాజ్, కోశాధికారిగా రమేష్ ఎన్నికయ్యారు. టెంజూ అధ్యక్షుడిగా మీర్జా అహ్మద్‌బేగ్, కార్యదర్శిగా సాయిబాబా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి యోగి, తెంజు అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ రమణ, సుమారు 100 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు బక్కి వెంకటయ్య పరామర్శ


భూంపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామానికి చెందిన కుర్మ భరతమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం గ్రామంలోని బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య పరామర్శించారు. మృతికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ప్రభాకర్, మహేష్, శ్రీనివాస్, కిషన్ ఉన్నారు.

జిల్లావాసులకు పండుగ సాయన్న సేవాపురస్కారం

సిద్దిపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పురస్కారాల కార్యక్రమంలో ఇద్దరు జిల్లావాసులు పండుగ సాయన్న సేవా పురస్కారాలను అందుకున్నారు. సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన పడిటే ప్రశాంత్ ముదిరాజ్, కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన తెలంగాణ మత్స్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, యువ రచయిత కొమురవెల్లి నర్సింలు ఈ పురస్కారాలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పురస్కారంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో సుతారి రాజు ముదిరాజ్, జిల్లెల్ల సుధాకర్ ముదిరాజ్, హైకోర్టు అడ్వకేట్ డీఎల్ పాండు ముదిరాజ్, ఉప్పరి నారాయణ ముదిరాజ్, శివ ముదిరాజ్, తెలంగాణ మత్స్యకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలను పరామర్శించిన హరీశ్‌రావు


సిద్దిపేటలో మృతుల కుటుంబీకులను పరామర్శిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్/ సిద్దిపేట రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణానికి చెందిన పలువురు మృతుల కుటుంబ సభ్యులను మాజీమంత్రి హరీశ్‌రావు ఆదివారం వారి నివాసాల్లో పరామర్శించారు. పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు విశ్వనాథ్ మల్లేశం కొడుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. పట్టణంలోని ఒకటవ వార్డు పార్టీ సీనియర్ నాయకుడు చంద్రం కోడలు, తిరుపతిరెడ్డి తల్లి అనారోగ్య కారణంగా చనిపోయారు. పట్టణానికే చెందిన మున్సిపల్ కాంట్రాక్టర్ గ్యాదరి వెంకటస్వామి తల్లి అనారోగ్యంతో చనిపోయారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థి దేవదాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి హరీశ్‌రావు వారిని ఓదార్చారు. ఆయా కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

● సిద్దిపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి సిరిచందన షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఆదివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో సిరిచందన తల్లిదండ్రులు మాజీమంత్రి హరీశ్‌రావును కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు సిరిచందనను అభినందించి, తన సంపూర్ణ సహకారం ఉంటుందని, భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు ఇంట్లో ఆదివారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమం నిర్వహించగా హరీశ్‌రావు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సిద్దిపేట పట్టణంలోని గణేష్ నగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 12న నిర్వహించనున్న గోదా కళ్యాణం కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతూ మాజీ మంత్రి హరీశ్ రావుకు ఆలయ నిర్వాహకులు ఆహ్వానం అందించారు.

కరాటే పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు


కరాటే పోటీల్లో సత్తాచాటిన దుబ్బాక విద్యార్థులు

దుబ్బాక, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మెదక్‌లోని జీకేఆర్ గార్డెన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్‌డోజో కరాటే చాంపియన్ పోటీల్లో దుబ్బాక విద్యార్థులు సత్తా చాటారని కరాటే మాస్టర్ బూరనిశ్రీకాంత్ ఆదివారం తెలిపారు. దుబ్బాకకు చెందిన వివిధ పాఠశాలలకు చెందిన ఐశ్వర్య, వర్షిని, విహాన్, లక్షిత, అర్చన, అక్షయ. రిషిక్, భరద్వాజ్, మనస్వీన్, హర్షవర్ధన్, శ్రెయాన్స్ బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు.

అబాకస్‌తో విద్యార్థుల జ్ఞాపకశక్తికి పదును


అబాకస్ మ్యాథ్స్ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దిపేట అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అబాకస్ నేర్చుకోవడం వలన పిల్లలలో సృజనాత్మకత శక్తి జ్ఞాపకశక్తి పెరిగి మ్యాథ్స్ అంటే భయం పోతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. విశ్వం అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేటలో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 35 పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరికృష్ణ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమం పిల్లల్లో భయం పోగొట్టి వారి జ్ఞాపకశక్తికి పదునుపెడుతుందన్నారు. ప్రథమ, ద్వితీయ బహుమతులలో 30 మంది పిల్లలు విజేతలుగా ఎంపిక అయ్యారని మీరు ఫిబ్రవరి 2న జరిగే స్టేట్ లెవెల్ పోటీల్లో పాల్గొంటారని ఎడ్యుకేషన్ టెక్ రీజనల్ హెడ్ వినాయక్ తెలిపారు. కార్యక్రమంలో విశ్వం టీం లక్ష్మి, నారాయణ, మహేష్, రాహుల్, శివ, సాయి, స్రవంతి, లక్ష్మినరసయ్య, సురేందర్, సాగర్, ఉమారాణి, కిషోర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




సిద్దిపేట హైస్కూల్ గ్రౌండ్‌లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా బోగి మంటలు, గంగిరెద్దు విన్యాసాలు

సిద్దిపేటలో అలరించిన సంక్రాంతి సంబురాలు

సిద్దిపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట హైస్కూలు గ్రౌండ్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు సందడిగా సాగాయి. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం పల్లె వాతావరణం ప్రతిబింబించేలా సాగింది. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, బోగి మంటలు వేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, పిండి వంటల ప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాసంగారి వెంకట్, కటకం మానస, బొమ్మగొని పద్మ, గరిపల్లి తులసి, జోగిపర్తి హారిక, బుక్క స్వప్న, మద్ది అనిత, కొమురవెల్లి కళ్యాణి, పిన్న శిరీష, రాధిక తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్‌లోని శ్రీసీతారామ, ఉమామహేశ్వరాలయం

అభివృద్ధికి నోచని ఆలయాలు

(5వ పేజీ తరువాయి)


ఆలయంలో కొలువైన శ్రీకొండపోచమ్మ

అందరి మెదళ్లలో నానుతుంది. స్థానిక నాయకులు ఈ విషయాన్ని మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తే ఇక్కడి ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గత ప్రభుత్వం హయాంలో గజ్వేల్ నియోజకవర్గానికి భారీగా నిధులు వచ్చాయన్న ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అసలు అభివృద్ధే జరగని ఈ ఆలయాలపైనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కరుణ చూపాలని, పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆలయాల అభివృద్ధి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం


మాట్లాడుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుని, కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుల ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, రవిందర్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, అజ్గర్, ఏక్బాల్ తదితరులున్నారు.